www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 25 ఆగస్టు 2023

5

పశ్చిమ గోదావరి

ఆకివీడు ఎఎంసి డైరెక్టర్‌గా సుబ్బయ్య

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు పడమటి సుబ్బయ్య ఆకివీడు ఎఎంసి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, మండల, గ్రామ వైసిపి నాయకులు ఆకివీడు ఎఎంసి డైరెక్టర్‌గా నియమించడం తనకు ఆనందంగా ఉందన్నారు. వైసిపి శ్రేణులు నాపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు

అటకెక్కిన రెగ్యులేటర్లు..!

- కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణాన్ని పట్టించుకోని పాలకులు
- ఉప్పునీరు చేరి దెబ్బతింటున్న భూములు
- సిఎంనే స్వయంగా ప్రకటించినా అతీగతీలేని దుస్థితి
- ఎన్నికల ముందు శంకుస్థాపనల జాబితాలోకేనా ఇది
- కొల్లేరు పర్యాటక అభివృద్ధి సైతం కాగితాల్లోనే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు ప్రజల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఎన్నికల తరుణంలో కొల్లేరు ప్రజలకు హామీలు గుప్పించడం.. గెలిచిన తర్వాత మౌనం వహించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిపోయింది. 2014 ఎన్నికల్లో తాము అధికారంలోకొస్తే కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని టిడిపి హామీ ఇచ్చింది. అసెంబ్లీలో తీర్మానం చేసి మమ అన్పించడం తప్ప జరిగిందేమీ లేదు. కొల్లేరులో పర్యాటక అభివృద్ధి సైతం వాగ్దానాలకే పరిమితమైంది. 2019 ఎన్నికలు, ఆ తర్వాత వైసిపి సైతం కొల్లేరు ప్రజలకు పలు హామీలు గుప్పించింది. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసి అక్కడి ప్రజలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి ఒక్క నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు 2022 మే 16న గణపవరంలో జరిగిన బహిరంగ సభలో సిఎం జగన్ ప్రకటించారు. ఎన్నికలు జరిగి నాలుగేళ్లయింది. కొల్లేరులో పర్యాటక అభివృద్ధి అనేది కాగితాలకే పరిమితమైంది. ఇక రెగ్యులేటర్ల నిర్మాణానికి వస్తే సిఎం ప్రకటించిన ఏడాదిన్నర కావొస్తున్నా ఒక్క అడుగూ ముందుకు పడని దుస్థితి నెలకొంది. దీంతో కొల్లేరు అభయారణ్యం ఉప్పకయ్యలుగా మారుతున్న దుస్థితి ఏర్పడింది. కొల్లేరులోకి సముద్రం నుంచి ఉప్పునీరు చేరి భూములన్నీ దెబ్బతింటున్నాయని, ఉప్పునీరు రాకుండా రెగ్యులేటర్లు నిర్మించాలని ఎప్పటి నుంచో జనం కోరుతున్నారు. దీంతో ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం పడితడక వద్ద రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. రెగ్యులేటర్ల నిర్మాణానికి రూ.412 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రభుత్వం నిధులకు సంబంధించిన ఉత్తర్వులు సైతం జారీ చేసినట్లు ప్రకటించారు. అయినా ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. అసలు రెగ్యులేటర్ల నిర్మాణం జరుగుతుందా అనే చర్చ కొల్లేరు ప్రజల్లో నెలకొంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీల్లో తాగునీటికి సంబంధించి వాటర్ గ్రిడ్ నిర్మాణం, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం ప్రధానమైనవి. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు దాటిపోయింది. మరో ఏడెనిమిది నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి వరకూ జిల్లాకు ఇచ్చిన ఏఒక్క హామీ నెరవేరలేదు. వాటర్‌గ్రిడ్ పూర్తికాకపోవడంతో ఇప్పటికీ జనం కలుషిత నీటినే తాగుతూ రోగాలబారిన పడుతున్నారు. రెగ్యులేటర్ల నిర్మాణం జరగకపోవడంతో కొల్లేరులో ఉప్పునీరు చేరి పర్యావరణం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది.

పడకేసిన పర్యాటక అభివృద్ధి

కొల్లేరు అభయారణ్యం 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రతియేటా వందల సంఖ్యలో విదేశీ పక్షులు ఇక్కడకు వలస వస్తుంటాయి. కొల్లేరులో బోటు షికారు, రిసార్ట్స్ వంటివి ఏర్పాటు చేస్తే పర్యాటకంగా ఎంతగానో అభివృద్ధి చెందుతోంది. కొల్లేరు ప్రజలతోపాటు ఎంతోమందికి ఉపాధి దొరుకుతోంది. దీనిపై అనేకసార్లు అధికారులు సమీక్షలు చేయడం తప్ప పనులు మాత్రం సాగలేదు. ఆటపాక వద్ద ఉన్న పక్షుల కేంద్రాన్ని సైతం అభివృద్ధి చేయకుండా గాలికొదిలేసిన పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండతో బడాబాబులు మళ్లీ చేపల చెరువులు తవ్వుతూ కొల్లేరును పూర్తిగా కలుషితం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులేటర్ల నిర్మాణంతోపాటు కొల్లేరు పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

4,318 మంది లబ్ధిదారులకు రూ.5.33 కోట్లు లబ్ధి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

నవరత్నాలు - ద్వై వార్షిక నగదు మంజూరులో భాగంగా జిల్లాలో 4,318 మంది లబ్ధిదారులకు రూ.5.33 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోవడం, బ్యాంకు ఖాతా వివరాలు సరిగా లేకపోవడం తదితర కారణాల వల్ల మిగిలిపోయిన వారికి నవరత్నాలు - ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని గురువారం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, గ్రామ, వార్డు సచివాలయాలు, గ్రామీణాభివృద్ధి, విద్య, బిసి సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులు, వివిధ ప్రాంతాల లబ్ధిదారులతో కలిసి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకాల లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో అర్హులందరికీ సంతృప్తికర స్థాయిలో పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న అమ్మఒడి పథకం కింద 551 మంది లబ్ధిదారులకు రూ.71.63 లక్షలు, వైఎస్ఆర్ నేతన్న నేస్తం ఆరుగురికి రూ.1.44 లక్షలు, వైఎస్ఆర్ రైతు భరోసా 574 మందికి రూ.39.01 లక్షలు, ఇబిసి నేస్తం ద్వారా 264 మందికి రూ.39.60 లక్షలు మొత్తం 4,318 మందికి రూ.533.31 లక్షలను తదితర ద్వైవార్షిక లబ్ధి కార్యక్రమం కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్. అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతి రావు, సాంఘిక సంక్షేమ అధికారి శోభారాణి పాల్గొన్నారు.

తొలగించిన ఓట్లు పున:పరిశీలించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

తొలగించిన ఓట్లను పారదర్శకంగా పున:పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో తొలగించిన ఓట్లు పున:పరిశీలనపై ప్రత్యేక అధికారులతో ఆమె సమావేశమయ్యారు. జిల్లాలో తొలగించిన ప్రతి ఓటునూ పున:పరిశీలించాలన్నారు. 2022 జనవరి 6 నుంచి ఇప్పటి వరకూ తొలగించిన ప్రతి ఓటునూ క్షేత్రస్థాయికి వెళ్లి పున:పరిశీలించాలని బిఎల్ఒలను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లవారీగా ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిఒక్క ఓటరు తాలుకా తీసుకున్న చర్యల రికార్డు, జారీ చేసిన నోటీసులు, దానికి సంబంధించిన జవాబు ఫైలును ఇఆర్ఒ నెట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఓటూ నిబంధనల ప్రకారం సంబంధిత విధానం, పత్రాల ఆధారంగా తొలగించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఓట్ల తొలగింపు పరిశీలన అధికారులు ఆశాకిరణ్, వి.స్వామినాయుడు, ఉయ్యాల ఆదిశేషు, జాషువా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి

భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుండి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం, రీసర్వే ప్రక్రియ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.జాషువా పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో 16 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయ్యిందని, ఆయా గ్రామాల్లో పాసు పుస్తకాలు పంపిణీ చేసి స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. రెండో దశలో 54 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ చేపట్టామని, ఆ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

కొనసాగిన చంద్రయాన్ - 3 విజయోత్సవాలు

పాలకొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల (అటానమస్) విద్యార్థులు పట్టణంలో గురువారం చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యాన సాగిన ర్యాలీలో భారతదేశ సైంటిస్టుల గొప్పదనాన్ని, ఇస్రో గొప్పదనాన్ని కీర్తిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ జి.మహేష్, డాక్టర్ వి.విజయలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: చంద్రయాన్-3 విజయవంతంపై ఇస్రో శాస్త్రవేత్తలకు టిడిపి పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో టిడిపి డ్వాక్రా, అంగన్వాడీ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ మాట్లాడగా నేతలు గూడూరి సుబ్బారావు, రేవు వెంకన్న, కోళ్ల నాగేశ్వరరావు, మాదాసు కనకదుర్గ, ఎస్‌డి.నసీమాబేగం, ఎమ్‌డి.షబీనా, గునుపూడి తిరుపాల్, మైలాబత్తుల ఐజాక్‌బాబు, ఎద్దు ఏసుపాదం, ఎమ్‌డి.నౌషద్, గంటా త్రిమూర్తులు, చెల్లబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులు చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయా గ్రామాల్లో గురువారం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించగా సర్పంచి కొపనాతి పల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : చంద్రయాన్-3 విజయంతో ప్రపంచంలో భారతదేశం ప్రథమ స్థానంలో నిలిచిందని మండలంలోని అజ్జమూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ఎస్.నారాయణ (విక్రమ్) అన్నారు. పాఠశాలలో సహ ఉపాధ్యాయులు విద్యార్థులు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు కామేశ్వరి చంద్రయాన్ వివరాలను తెలియజేసే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.



గూడెంలో ఇస్రో ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ప్రత్తిపాడు సెయింట్ మేరీస్ పాఠశాలలో గురువారం ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలికారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు జై ఇస్రో ఆకృతిలో నిలబడి శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ మాట్లాడారు. శాస్త్రవేత్తలు మరిన్ని పరిశోధనలు చేసి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా ఉండేలా చేయాలని అమల్‌రాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీ జ్వర పీడితులను కాపాడండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్

ప్రజాశక్తి - పెనుగొండ

రెండు నెలలుగా తామరాడలో విలయ తాండవం చేస్తున్న డెంగీ జ్వరాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం తామరాడలో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గ్రామంలో సుమారు 460 కుటుంబాలకుపైగా ఉన్నాయని, ప్రతి కుటుంబంలో ఒకరు లేక మొత్తం అందరూ జ్వర పీడితులుగా ఉన్నారన్నారు. జ్వర పీడితులకు సరైన వైద్యం అందనందున, మరోవైపు తెల్ల రక్త కణాల సంఖ్య తగ్గిపోవడంతో పాలకొల్లు, పెనుగొండ, తణుకు ప్రయివేటు ఆసుపత్రులలో చేరి ప్రాణాలు రక్షించుకుంటున్నారని తెలిపారు. ప్రతి కుటుంబం రూ.పది వేల నుంచి రూ.70 వేల వరకూ ప్రయివేటు ఆసుపత్రుల్లో ఖర్చు పెట్టాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. గ్రామంలో తక్షణం వైద్య శిబిరం నిర్వహించాలని, తామరాడలో పరిస్థితులు కుదుటపడే వరకూ వైద్య శిబిరం కొనసాగించాలని కోరారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని, ఆశా వర్కర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, తామరాడ గ్రామ కార్యదర్శి మామిడిశెట్టి వెంకట్రావు, నేత కడిమి పెళ్లికొడుకు పాల్గొన్నారు.

రోగులను పరామర్శిస్తున్న కేతా గోపాలన్

జ్వరాలతో బాధపడుతున్నాం..

వైద్యఆరోగ్య శాఖ డిటి వద్ద తామరాడ గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - పెనుగొండ

'అయ్యా చాలా రోజులుగా తాము జ్వరాలతో బాధపడుతున్నాం. రోజులు తరబడి జ్వరాలు తగ్గడం లేదు. ప్రయివేటు ఆసుపత్రులకెళ్తే రూ.50 వేలకుపైగా ఖర్చవుతోంది. ఆ ఖర్చు భరించలేక ఇళ్లలోనే ఉంటున్నాం. మా ప్రాణాలు కాపాడండి' అంటూ తామరాడ గ్రామస్తులు వైద్యఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్ వద్ద వాపోయారు. తామరాడలో జ్వరాలు విజృంభించిన నేపథ్యంలో ఆ గ్రామంలో అధికారుల బృందం గురువారం పర్యటించింది. ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర బాధితుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ జ్వరాలతో తట్టుకోలేకపోతున్నామరి, మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పరిస్థితిని సిద్ధాంతం పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ పావనిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 12 మంది శాంపిల్స్ సేకరించి డెంగీ పరీక్షకు పంపించామని ఆమె తెలిపారు. దీనిపై శ్రీకాంత్ స్పందిస్తూ జ్వరం వచ్చిన వెంటనే మలేరియా, డెంగీ పరీక్షలు చేయాలని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారి వెంకటేశ్వరరావు, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న అధికారుల బృందం

గామంలో పంచాయతీ ఆధ్వర్యాన బ్లీచింగ్ చల్లారు. మురుగుగుంటలు ఎక్కువగా ఉండటంతో మట్టిని తోలించి పూడ్చించారు. ఈ కార్యక్రమాలను ఇఒపిఆర్‌డి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్యామల పర్యవేక్షించారు.

హామీల అమలు కోరితే తీవ్రవాదులమా..!

సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ - చలో విజయవాడకు వెళ్లొద్దని పోలీసుల నోటీసులపై ఆగ్రహం

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరేందుకు చలో విజయవాడకు వెళ్లే వారిని పోలీసులు నోటీసులిచ్చి అడ్డుకోవడం దారుణమని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విమర్శించారు. మున్సిపల్ కార్మికుల చలో విజయవాడకు వెళ్లొద్దంటూ గురువారం స్థానిక అమరవీరుల భవనం వద్దకు వచ్చి పట్టణ పోలీసులు ప్రతాప్‌కు నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎన్నిసార్లు కోరినా స్పందన లేదన్నారు. దీనిపై అడిగేందుకు విజయవాడ వెళ్లకూడదా అని ప్రశ్నించారు. తీవ్రవాదులు, అసాంఘిక శక్తుల్లా విజయవాడ రావొద్దని నోటీసులు ఇవ్వడం తగదన్నారు. ఇలాంటి నోటీసులు ఇవ్వడం మానుకొని పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమ పథకాలకు సమానంగా, ధరలు కూడా పెరగుతున్నాయని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఇలాంటి నోటీసులు, బెదిరింపులతో ఉద్యమాలు అగవని ప్రభుత్వం, అధికారులు గ్రహించాలని అన్నారు. ప్రజాతంత్రవాదులంతా ఈ నిర్బంధాన్ని ఖండించాలని కోరారు.

ప్రతాప్‌కు నోటీసు అందజేస్తున్న పోలీసు అధికారి

రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు

డిఆర్ఒ కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తుగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో స్పందన సమావేశ మందిరంలో డిఆర్ఒ కృష్ణవేణి అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అత్యధిక శాతం జనాభా రోడ్డు ప్రమాదాల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జనాభాతోపాటు వాహనాల వినియోగం పెరిగిన నేపథ్యంలో రవాణా, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలపై పోలీస్, రవాణా, రహదారుల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదం జరగడానికి కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదికను సమర్పించాలన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత తీసుకునే చర్యల కంటే ముందస్తుగానే తగిన చర్యలు తీసుకుంటే రహదారుల భద్రత కమిటీ సమావేశం సత్ఫలితాలను ఇస్తుందన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతాచర్యలపై కార్యాచరణ రూపొందించాలని ఆమె సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వారికి జరిమానా విధించాలని అన్నారు. రోడ్లపై గుంతల్లో నీళ్లు నిలువడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, నీళ్లు నిలవకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. కాళీపట్నం, ముత్యాలపల్లి గ్రామాలకు అనుకుని ఉన్న జాతీయ రహదారిపై పశువులు తిరగడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయనినేషనల్ హైవే అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై డిఆర్ఒ స్పందిస్తూ వెంటనే జిల్లా పంచాయతీ అధికారి ద్వారా సంబంధిత పంచాయతీల సర్పంచులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. పోలీస్ అధికారులు కూడా సంబంధిత గ్రామాల ప్రజలతో మాట్లాడాలని సూచించారు. వీరవాసరం, లంకలకోడేరు, భీమవరం బైపాస్, ఉండి, ఉండి నుండి గణపవరం వెళ్లే రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవని రవాణా శాఖ పరిశీలనలో గుర్తించామని ఆ శాఖ ప్రతినిధి తెలిపారు. దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డిఆర్ఒ ఆదేశించారు. ప్రమాద కేసుల్లో బాధితుల వివరాలను తప్పనిసరిగా ఐరాడ్ యాప్‌లో నమోదు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆమె ఆదేశించారు. జిల్లా రవాణాధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మే నుండి జూలై వరకు 46 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, 47 మంది చనిపోయారని, 164 మంది క్షతగాత్రులయ్యారని తెలిపారు. ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రోడ్డు భద్రత సూచనలపై వాల్‌పోస్టర్లను డిఆర్ఒ ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్అండ్‌బి ఇఇ లోకేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్యామల, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిసిఆర్‌బి ఎస్ఐ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐలు ఫయాజుద్దీన్, సతీష్, ఎంవిఐలు కెఎస్.ప్రసాద్, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, డిఎస్ఎస్ నాయక్, సంజీవ్ కుమార్, ఎఎంవిఐ ఎం.రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఆర్ఒ కృష్ణవేణి, జిల్లా రవాణా అధికారి ఉమా మహేశ్వరరావు

టిడ్కో గృహ లబ్ధిదారులకు ఉచిత వ్యాన్ సర్వీస్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు టిడ్కో గృహాల నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ టిడ్కో గృహాల వారు ప్రయాణించేందుకు ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ఉచిత వ్యాన్ సర్వీస్‌ను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు గురువారం ప్రారంభించారు. పట్టణం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న టిడ్కో గృహస్తులు ఈ వ్యాన్ ద్వారా ఉచితంగా ప్రయాణం చేయొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి నేతలు పెచ్చెట్టిబాబు జివి, కర్నేన రోజా రమణి, మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న మొగల్తూరు పూల మార్కెట్

వరలక్ష్మి వ్రతం నేపథ్యంలో..

పండ్లు, పూల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వరలక్ష్మి వ్రతం నేపథ్యంలో పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. అరటిపండ్ల డజను రూ.30 నుంచి రూ.60కు పెరిగాయి. చామంతి పూలు కిలో రూ.200 నుంచి రూ.600కు పెరగ్గా గులాబీలు కిలో రూ.300 నుంచి రూ.600కు పెరిగాయి. మల్లెపూలు సైతం ఘాటెక్కాయి. కిలో రూ.800 నుంచి రూ.13 వందల వరకూ పెరిగాయి. ఇక ఆపిల్, బత్తాయి, పంపర పనస, దానిమ్మ పండ్ల ధరలు రెట్టింపయ్యాయి. దీంతో కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు.

మొగల్తూరు: మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీబొమ్మ సెంటర్ గురువారం కళకళలాడింది. ఈ నెల 25న వరలక్ష్మీ వ్రతం కావడంతో పూజా సామగ్రి కొనుగోలుకు విచ్చేసిన జనంతో మార్కెట్ ప్రాంతం కళకళలాడింది. పూలు, పండ్లు, బంగారం, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

గుడాల గోపీని సత్కరిస్తున్న సభ్యులు

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పర్యటన

ప్రజాశక్తి - పోడూరు

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ మండలంలోని వద్దిపర్రు,పెనుమదం గ్రామల్లో గురువారం పర్యటించారు. గ్రామాల్లోని వైసిపి నాయకులను, కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. ఆయన వెంట జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, వైసిపి నాయకులు పితాని చిన్న, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, జెసిఎస్ కన్వీనర్ బల్ల రాజశేఖర్, పెనుమదం సొసైటీ ఛైర్మన్ కొర్రపాటి వీరాస్వామి, ఎస్‌సి సెల్ నాయకులు వడ్లపాటి సురేష్, సుధాకర్ ఉన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఉన్న చెత్త బుట్టలు

పంపిణీకి చెత్త బుట్టలు సిద్ధం

ప్రజాశక్తి - పోడూరు

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో పంపిణీ చేసేందుకు చెత్తబుట్టలు సిద్ధమయ్యాయి. జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ తడి చెత్త, పొడి చెత్త వేసేందుకు వేర్వేరు బుట్టలు పంపిణీ చేయనున్నారు. మండలంలో 20 వేల చెత్త బుట్టలు అవసరమవ్వగా ఇప్పటి వరకు 16 వేలు ప్రభుత్వం పంపించిందని ఎంపిడిఒ డి.సుహాసిని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుండి చెత్త బుట్టలను గురువారం పంచాయతీలకు సరఫరా చేస్తున్నారు. ప్రజలందరూ పంచాయతీ నుండి ఇచ్చిన చెత్తబుట్టలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, ఎంపిడిఒ డి.సుహాసిని, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ బుజ్జేశ్వరరావు కోరారు.

గంగానమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని రెస్ట్ హౌస్ రోడ్డు శివార్లలో శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతరను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రంధి మాట్లాడుతూ జాలర్ల సంఘం సొసైటీ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రతియేటా ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

టిడిపి హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి (బుల్లాలు) అన్నారు. గురువారం మల్లిపూడిలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరల పెంపుపై ప్రచారం సాగించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, వెలగల బుల్లిరామిరెడ్డి, మాజీ సర్పంచి సానబోయిన సూర్యకాంతం, ఎంపిటిసి దండు లక్ష్మి, నేతలు దండు నాగరాజు, దండు అలేఖ్య, చింతపల్లి రామకృష్ణ, కర్రి అచ్యుతరామారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు మొక్కలు పెంచి అందించాలి

ప్రజాశక్తి - ఉండి

వరి విత్తనోత్పత్తితో పాటు వివిధ రకాల మొక్కలు, పండ్లు, కూరగాయలు ఎక్కువ సంఖ్యలో పెంచి రైతులకు అందించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను మార్టేరు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎన్.భరతలక్ష్మి అన్నారు. గురువారం ఎన్‌ఆర్‌పి అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని డాక్టర్ ఎన్.భరతలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా వారు విత్తనోత్పత్తి క్షేత్రం, సేంద్రియ ప్రకృతి వ్యవసాయ ప్రదర్శన క్షేత్రం, ఉద్యానవన షేడ్ నెట్ నర్సరీ, కొత్తగా ఏర్పాటు చేసిన వివిధ రకాల అరటి మొక్కల ప్రదర్శన క్షేత్రం, వరిలో నేరుగా విత్తే పద్ధతి, డ్రమ్స్ సీడర్ పద్ధతి ప్రదర్శన క్షేత్రాలను పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ అరటిలో అంతర పంటలుగా బెండ, పసుపు తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మల్లికార్జునరావు, ఎన్.డిబోరా మెస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ ఎ.రాజేష్, రంజిత రెడ్డి పాల్గొన్నారు.

కెవికెను సందర్శించిన డాక్టర్ ఎన్.భరతలక్ష్మి

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చెత్తాచెదారంతో నిండిన పార్కు ఆవరణ

నిరుపయోగంగా ఉన్న క్యాంటీన్

నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం..!

జన్మభూమి పార్కు వద్ద కొరవడిన పర్యవేక్షణ
అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
పట్టించుకోని అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - ఉండి

నిత్యం సందర్శకులతో ఉండే ఉండి జన్మభూమి పార్కు నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అధికారులు, నాయకుల పర్యవేక్షణ కొరవడడంతో రాత్రి సమయంలోనే కాకుండా పట్టపగలే మందుబాబులు రెచ్చిపోతున్నారు. దీంతో పార్కులో ఎక్కడ చూసినా ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ ప్యాకులు, తాగి పడేసిన గ్లాసులు దర్శనమిస్తున్నాయి. దీంతో పార్కులోకి వచ్చేందుకు సందర్శకులకు ఇబ్బందికరంగా మారింది. పల్లె ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని అందించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా 2016వ సంవత్సరంలో అప్పటి ఉండి శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు ఆధ్వర్యంలో ఉండిలో జన్మభూమి పార్కును అభివృద్ధి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రెండోసారి ఎంఎల్‌ఎగా గెలిచిన తర్వాత శివరామరాజు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఉండి పార్కును ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. పార్కులో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం, ఫలాహార శాల, చిన్నారులకు క్రీడా సామగ్రి, వృద్ధులు నడిచేందుకు వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేసి సందర్శకులకు సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దారు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు అధికారులు పార్కు ఆలనా పాలనా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. జన్మభూమి పార్కు నిర్వహణ బాధ్యతలు చూసే నాధుడే లేదని, దీంతో ఎక్కడ చూసినా పెరిగిపోయిన చెట్లు, పుట్టలు, పొదలతో పార్కు దర్శనమిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కులోని కాటన్ విగ్రహం చెద పుట్టలతో నిండిపోయి ఉండడం ఆవేదన కలిగిస్తోందని చెబుతున్నారు. పార్కులోని క్రీడా సామగ్రి పూర్తిగా చెడిపోయి చిన్నారులు ఆడుకునేందుకు వీలు లేకుండా ఉండడంతో చిన్నారుల సైతం ఇటువైపుగా కన్నెత్తి చూడడం లేదు. 165వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ జన్మభూమి పార్కును అభివృద్ధి చేసి తిరిగి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని, మందుబాబుల నుంచి పార్కును రక్షించాలని ప్రకృతి ప్రేమికులు, ప్రజలు కోరుకుంటున్నారు.

పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

జన్మదిన వేడుకలు ఆడంబరంగా జరుపుకోకుండా పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేయడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. పెదఅమిరం గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మనవడు కార్తికేయ మొదటి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 700 మంది పేదలకు పివిఎల్ నరసింహారాజు చేతుల మీదుగా దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. పేదలకు చీరలు, దుప్పట్లు, రగ్గులు, పంచెలు యాపిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడగా కార్యక్రమంలో మాజీ సర్పంచులు కఠారి విశ్వనాథరాజు, యిర్రింకి పద్మనాభం, మాజీ ఉప సర్పంచులు కోరా రామ్మూర్తి, నడింపల్లి సుబ్బరాజు, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు, బూరాడ వెంకటకృష్ణ, కలువ వెంకట్రావు, మాజీ ఎంపిటిసి రామకష్ణంరాజు,డొక్కు సోమేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్న పివిఎల్ నరసింహారాజు

ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రూపొందించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని యండగండి పిహెచ్‌సి వైద్యులు బిన్నీ శామ్యూల్ అన్నారు. మహాదేవపట్నం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి శామ్యూల్ మాట్లాడారు. ఉదయం సచివాలయ ఆవరణలో రోగులకు కావాల్సిన వైద్యాన్ని అందిస్తూ మధ్యాహ్నం రోగుల ఇంటికెళ్లి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణులకు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభిషేక్‌ను అభినందిస్తున్న ఆలయ పాలకవర్గం

డిఎస్‌పిగా ఎంపికైన అభిషేక్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసిన డిఎస్‌పిగా ఎంపికైన రావూరి అభిషేక్ కుటుంబానికి ఆలయ పాలకవర్గం గురువారం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికింది. దేవస్థానం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. స్వామి వారి ప్రసాదాలు, ఫొటో అందించారు. కార్యక్రమంలో అభిషేక్ తండ్రి చాచా, తల్లి శ్రీదేవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఆక్రమణలు అడ్డు

మరో రెండు రోజులు ఆర్‌అండ్‌బి అధికారుల సర్వే
డిజైన్ల ఖరారుపై ఎంఎల్‌ఎ గ్రంధి కసరత్తు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యనమదుర్రు డ్రెయిన్‌పై నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి అక్రమ కట్టడాలు అడ్డంకిగా మారాయి. దేవాలయాలు, పలు అక్రమ నిర్మాణాలు వంతెనల పక్కన ఉండడంతో డిజైన్లు ఖరారు విషయంలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌తో ఆర్‌అండ్‌బి ఇఇ లోకేశ్వరరావు, డిఇ రామరాజు, కన్సల్టెంట్ రామకృష్ణ సమావేశమై డిజైన్ల ఖరారు కోసం చర్చించారు. నాలుగైదు రోజుల్లో డిజైన్లు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాసరావు

దళితులపై దాడికి కారకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వాండ్రంలో దళితులపైన, ప్రార్థనా మందిరంపై దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని, వెంటనే వారిని అరెస్టు చేయాలని మాల చైతన్య మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు తోకల రాజేష్‌బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వాండ్రం దళితులపై నమోదు చేసిన కేసులను అధికారులు వెంటనే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా గుణ్ణం నాగబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి నేత గుణ్ణం నాగబాబు పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నేతలు, అధికారులు నాగబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, వైసిపి పట్టణాధ్యక్షులు చందక సత్తిబాబు, మైఖేల్‌రాజు, క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, అడబాల వెంకటరమణ, చిట్టూరి ఏడుకొండలు, పలు ట్రస్టు బోర్డుల ఛైర్మన్లు జోగి వెంకటేశ్వరరావు, మామిడి బాబు, గంగా పవన్, ఉనికిలి శ్రీనివాస్, ఇజ్జాడ చినబాబు, మోర్తా గిరీష్, నీలంశెట్టి ప్రసాద్ ఉన్నారు.


గుణ్ణం నాగబాబు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గుడాల గోపి

ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి పొరుగు సేవల పద్ధతిలో దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నియోజకవర్గాలు, మండలాలు, కలెక్టరేట్లో ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఎనిమిది డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. https://westgodavari.ap.gov.in పశ్చిమగోదావరి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 27వ తేదీ తుది గడువని పేర్కొన్నారు. ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టునకు రెమ్యూనరేషన్‌గా రూ.18,500 నెలకు చెల్లిస్తారని తెలిపారు. రాత పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించి నియమిస్తారని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్, ఐటి సెక్టార్‌లో కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండి సర్టిఫికెట్ కలిగి ఉన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ సమయంలో ఐదు శాతం వెయిటేజీ మార్కులు ఇస్తారని, అమల్లో ఉన్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉంటుందని, అభ్యర్థి వయస్సు 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. బ్యాచిలర్ డిగ్రీతోపాటు పిజిడిసిఎ లేక బిసిఎ, బిఎస్‌సి కంప్యూటర్స్, బిఇ (సిఎస్‌ఇ లేక ఐటి), ఎంసిఎ విద్యార్హత కలిగి ఉండి, ఆంగ్లంలో మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్హత పత్రాలను ఏదైనా గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి సమర్పించాలని తెలిపారు. నియామకం పొందిన అభ్యర్థి పనితీరును బట్టి ఒక సంవత్సరం తర్వాత పొడిగింపు ఉంటుందని తెలిపారు.

ఘనంగా కొత్తపల్లి పుట్టినరోజు వేడుకలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జన్మదిన వేడుకలను అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో సుబ్బారాయుడు జన్మదిన వేడుకల్లో భాగంగా అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును కోశారు. అనంతరం మిఠాయిలు, కేకు, శీతల పానీయాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మెండు రాజేష్, ముక్కు పుల్లయ్య, గురూజు శీను, మైలాబత్తుల రాంబాబు, పెంకె రామకృష్ణ, మేకల పరశురాం, పట్టా రజనీకుమారి, పొడపాటి అజయ్, రామాను వీర్రాజు, పెద్దపాటి వర్మ, కంబాల చిన్నారి, గుడాల చింతన్న పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్యం

మారుతీనగర్‌లో ఎంఎల్‌ఎ గ్రంధిచే ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మారుతీనగర్‌లో రూ.85 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన యుపిహెచ్‌సి వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని గురువారం ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతీనగర్‌లో యుపిహెచ్‌సి వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల 8 సచివాలయాలకు సంబంధించిన 27,619 మందికి వైద్య సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి ఈ 8 సచివాలయాలకు సంబంధించిన ప్రజలు ఇక నుంచి వెళ్లాల్సిన అవసరం లేదని, దగ్గర్లోని ఈ ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డిఇఒ, ఎల్‌జిఎస్, ఎనిమిది మంది ఎఎన్‌ఎంలు, 9 మంది ఆశా వర్కర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డిపిఎంఒ సువర్ణరాజు, డాక్టర్ లీలా లక్ష్మి, వాసర్ల ముత్యాలరావు, రాజేష్, ప్రవీణ్, కొత్తల కృష్ణబాబు, కముజు చిన్న, శ్రీనివాస్, నీలం శ్రీనివాస్, వాసంశెట్టి శ్రీనివాస్, కట్టా రవి పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

చంద్రయాన్-3 విజయవంతంపై సిపిఎం హర్షం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఇస్రో చంద్రయాన్-3 విజయవంతంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. శాస్త్రవేత్తల కృషి ఫలించిందని, సైన్సు అమోఘ విజయాలు సాధిస్తుందనే దానికి ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు.

సీసలిలో అన్న సమారాధన

కాళ్ల: సీసలిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఆలయం యాత్రికులతో కిటకలాడింది. ఏలూరుపాడు గ్రామానికి చెందిన గణపతి జనార్ధనరావు- కష్ణకుమారి దంపతులు, అల్లుళ్ల బంగ్రెడ్డి ఆదినారాయణ, నరహరిశెట్టి బాలాజీ దాతల ఆర్థిక సహకారంతో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్నిట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి పర్యవేక్షించారు.

ఎంఎల్‌ఎ నిమ్మల పర్యటన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మండలంలోని వడ్లవారిపాలెం, చింతపర్రు, లంకలకోడేరు గ్రామాల్లో పర్యటించారు. టిడిపి సాధికార మిత్ర, సేవా మిత్ర, తెలుగు యువత సభ్యులతో సమావేశమై టిడిపి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమాల్లో నేతలు పెచ్చెట్టి చంద్రమౌళి, కోడి విజయభాస్కర్, పాముల రజినికుమార్, నెక్కంటి ఆదినారాయణ, నీలం తాతాజీ, కొండేటి నరేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

27న చలో గాజువాక

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 27న విశాఖపట్నం జిల్లా గాజువాకలో జరగనున్న ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సభకు చేనేత కార్మికులు పెద్దఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమతం రమణ మహేష్ కోరారు. గురువారం సరళాదేవి నివాసం వద్ద పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. చేనేత కార్మికులు వత్తినే నమ్ముకుని జీవిస్తున్నారని వారి సమస్యలపై పిఎం, సిఎంలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. బడ్జెట్లో చేనేతలకు నిధులు పెంచి ఆదుకోవాలని అన్నారు. రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి మాట్లాడుతూ చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పప్పు దుర్గామహేష్, విశ్వనాథం, సత్య పరదేశి, హేమంత్ పాల్గొన్నారు

IN THE HONOURABLE COURT OF VI ADDITIONAL SENIOR CIVIL JUDGE, VISAKHAPATNAM
O.S. 39 of 2022

Between:-
1) Edru Nagendra Prasad
2) Edru Lakshmi Ratna Padma Kumari ...**Plaintiffs**
And:-
Senam Suman ...**Defendant**
To,
Senam Suman, S/o Atchyuta Chandra Sekhar @ Babu, R/o Door No: 5-4-1, Garapativari Street, Pathuru, Tanuku, West Godavari District.

Please take notice that the above suit is posted on **11-09-2023** for your notice by way of substituted service of summons as ordered by the Honourable Court. Therefore, you are informed by means of this notice that you have to appear in the above matter before the Honorable Court **at 10.30 A.M.** either in person or through an Advocate to answer the claims in the above Suit, failing which the claim in the suit will be decided in your absence.

Sd/- KHASPA KRISHNA MOHAN
KHASPA SAGAR
Advocate for Plaintiffs
Visakhapatnam
Dt:25-08-2023

పేరు మార్పు ప్రకటన

గెడ్డం సువర్ణ రాజు (కొత్త పేరు), తండ్రి గెడ్డం వెంకటేశ్వరరావు, గతంలో నా పేరు **గెడ్డం సువరణ రాజు** (పాత పేరు), తండ్రి: గెడ్డం వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-26, హరిజన పేట, పెనుమంట్ర గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును **గెడ్డం సువరణ రాజు** (పాత పేరు), తండ్రి: గెడ్డం వెంకటేశ్వరరావు నుండి **గెడ్డం సువర్ణ రాజు** (కొత్త పేరు) తండ్రి: గెడ్డం వెంకటేశ్వరరావు గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.

సెల్: 9182899030

పాస్‌పోర్టు పోయినది

కట్టా శ్రీను, తండ్రి: తాతారావు అను నేను కట్టావారిపాలెం నడిపూడి గ్రామ కాపురస్తులైన నా యొక్క **E.C. Passport No. X548261** గల పాస్‌పోర్టు పడిపోయినది. నడిపూడి నుండి పెనుగొండ వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పోయినది. ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్:
కట్టా శ్రీను, తండ్రి: తాతారావు
డోర్ నెం. 6-7/1, నడిపూడి
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా
పిన్: 534320
సెల్: 9849662420